సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం, 13, నవంబర్, 2024



చీనీ టన్ను రూ.33,800

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33,800, కనిష్టంగా రూ.16 వేల ప్రకారం ధర పలికింది.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.13 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
30.7°/ 18.4°

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

పెరిగిన ఎండు మిర్చి ధర



మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

హిందూపురం అర్బన్: ఎండుమిర్చి ధర పెరిగింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 503 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, ఈ–నామ్ పద్ధతిలో మార్కెట్‌లో వేలం పాట నిర్వహించినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో మొదటి రకం ఎండు మిర్చి క్వింటా రూ. 18,500, రెండో రకం రూ. 9 వేలు, మూడో రకం ఎండుమిర్చి క్వింటా రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు ఆయన వెల్లడించారు. రెండు వారాల క్రితం క్వింటా ఎండు మిర్చి మొదటి రకం రూ.14 వేల నుంచి రూ.16,500 లోపే పలికిందని, మంగళవారం క్వింటాపై రూ.2 వేలు పెరిగి రూ.18,500 మేర ధర లభించినట్లు వెల్లడించారు.

పోక్సో కేసులో ముద్దాయికి జీవితఖైదు

- బాలికపై లైంగికదాడి కేసులో తీర్పు వెలువరించిన జడ్జి రాజ్యలక్ష్మి
- బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశం

గోరంట్ల: ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడి చేసిన కేసులో ముద్దాయికి అనంతపురంలోని పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి జీవితఖైదు విధించారు. వివరాల్లోకి వెళితే...2020 నవంబర్ 18వ తేదీన గోరంట్ల మండలం నార్సింపల్లి గ్రామానికి చెందిన దంపతులు కూలి పనికి వెళ్లగా...వారి ఐదేళ్ల కుమార్తె ఇంటి ముందు ఆడుకుంటూ ఉంది. ఈ సమయంలో అక్కడికి వచ్చిన గొల్ల ఆదినారాయణ(54) చిన్నారికి మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లాడు. అనంతరం బాలికపై లైంగిక దాడి చేశాడు. కూలి పనులు నుంచి వచ్చిన బాలిక తల్లిదండ్రులు విషయం తెలుసుకుని అదేరోజు గోరంట్ల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో అప్పటి సీఐ జయా నాయక్ కేసు నమోదు చేశారు. అప్పటి ప్రభుత్వం పోక్సో కేసుల దర్యాప్తును వేగవంతం చేసేందుకు రాష్ట్రంలో దిశ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయగా.. అప్పటి దిశ డీఎస్పీ (ప్రస్తుత జిల్లా ఏఎస్పీ) ఆర్ల శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేసి సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు, 10 మంది సాక్షులను విచారించిన పోక్సో కోర్టు జడ్జి రాజ్యలక్ష్మి నేరం రుజువుకావడంతో మంగళవారం తుదితీర్పు ఇచ్చారు. ముద్దాయి ఆదినారాయణకు జీవిత ఖైదు విధించడంతో పాటు రూ.1000 జరిమానా విధించారు. అలాగే బాధితురాలికి రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని ఆదేశించారు. ముద్దాయికి శిక్ష పడేలా చేసిన ప్రస్తుత గోరంట్ల సీఐ శేఖర్, కోర్టు లైజర్ ఆఫీసర్ శ్రీనివాసులు, కోర్టు హెడ్ కానిస్టేబుల్ వీవీ నాయక్, సుధాకర్, కరుణాకర్‌రెడ్డి తదితరులను ఎస్పీ రత్న ప్రత్యేకంగా అభినందించారు.

వైఎస్సార్‌సీపీ జెండా స్తంభం కూల్చివేత

- మోత్కుపల్లిలో టీడీపీ నేతల దుశ్చర్య



మోత్కుపల్లిలో వైఎస్సార్ సీపీ జెండా స్తంభాన్ని విరగ్గొట్టిన దృశ్యం

హిందూపురం: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక టీడీపీ నేతల దౌర్జన్యాలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. వైఎస్సార్ సీపీ నేతలను రెచ్చగొట్టి ఘర్షణలకు దిగుతున్నారు. ఆ తర్వాత అధికారం అండతో బాధితులపైనే కేసులు నమోదు చేయిస్తున్నారు. తాజాగా మంగళవారం సాయంత్రం హిందూపురం మోత్కుపల్లిలో వైఎస్సార్ సీపీ జెండా స్తంభాన్ని టీడీపీ నాయకులు విరగొట్టారు. తమపార్టీ అధికారంలో ఉందని, ఇతర పార్టీల జెండాలు ఎగరకూడదన్న లక్ష్యంతోనే వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేసి జెండా స్తంభాన్ని విరగొట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో గ్రామ నాయకులు ఫిర్యాదు చేశారు.

గతంలోనూ జెండా స్తంభం గొడవ

సెప్టెంబర్ 6వ తేదీన టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ జెండా స్తంభాన్ని ధ్వంసం చేసేందుకు సిద్ధంకాగా, అప్పుడు వైఎస్సార్ సీపీ నేతలు అడ్డుకున్నారు. దీంతో అధికారం ఉపయోగించిన టీడీపీ నేతలు తమ కార్యకర్త రాజశేఖర్‌పై ఆరుగురు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు దాడి చేశారని కేసు నమోదు చేయించారు.

చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఇలాకా అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నిర్దేశిత వయసులో వేయాల్సిన టీకాలు ప్రభుత్వాస్పత్రుల్లో అరకొరగా ఉన్నాయి. సకాలంలో టీకాలు వేయించుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నా.. అందుకు తగ్గ టీకాలు అందుబాటులో ఉండకపోవడం గమనార్హం.

- ఉమ్మడి జిల్లాలో అందుబాటులో లేని వ్యాక్సిన్‌లు
- పెంటావాలెంట్ వ్యాక్సిన్ లేక బాలింతల ఆందోళన
- వేలాదిమంది చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- హెపటైటిస్ బి, మీజిల్స్ వ్యాక్సిన్‌లూ కొన్నిచోట్ల కొరత
- విధిలేక ప్రైవేటు ఆస్పత్రుల్లో కొనుక్కుంటున్న సామాన్యులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన రోజు నుంచీ చిన్నారులకు వేసే వ్యాధినిరోధక టీకాలు సమయానికి అందడం లేదు. పుట్టిన వెంటనే వేయాల్సిన కొన్ని రకాల వ్యాక్సిన్‌లు లేకపోవడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో డబ్బు చెల్లించి వేయించుకునే పరిస్థితి నెలకొంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధిగా ఉండాల్సిన ముఖ్యమైన టీకాలు స్టాకు లేవని చెబుతున్నారు. దీంతో వ్యయప్రయాసలకోర్చి తమ చిన్నారిని వ్యాక్సిన్‌కు తీసుకెళ్లే బాలింతలు నిరాశతో వెనుదిరిగి వస్తున్నారు. నిర్ణయించిన మేరకు వారానికి రెండు రోజుల పాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, హెల్త్‌క్లినిక్‌లలో వ్యాక్సిన్ ఉండాలి. కానీ అందుబాటులో ఉండడం లేదు. కొన్ని చోట్ల వ్యాక్సిన్‌కు వెళ్లిన బాలింతలకు ఇప్పుడే వేయకపోయినా ఫరవాలేదు, ఇంకో రెండు వారాలు ఆగి రండి అంటూ ఆరోగ్య సిబ్బంది చెప్పి పంపుతున్నారు.

హెపటైటిస్–బి 24 గంటల్లో ఇవ్వాల్సి ఉన్నా...

శిశువు పుట్టిన ఇరవై నాలుగు గంటల్లోనే కామెర్ల వ్యాధి రాకుండా హెపటైటిస్– బి వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉంది. కానీ ఈ వ్యాక్సిన్ ప్రధాన ఆస్పత్రుల్లోనే లేదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వేయించుకోవాలంటే భారీగా డబ్బు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో స్టాకు ఇంకా రాలేదని చెబుతుండటంతో ప్రైవేటు మెడికల్ షాపుల్లో కొనుక్కుని తెచ్చి తమ బిడ్డలకు వేయించుకుంటున్నారు. మీజిల్స్ రూబెల్లా (తట్టు రాకుండా) వేసే వ్యాక్సిన్ కూడా కనిపించడం లేదు. అత్యంత ప్రమాదకరమైన కోరింత దగ్గుకు ఇచ్చే డీపీటీ వ్యాక్సిన్ కొన్ని చోట్ల లేదు. విజయవాడ నుంచి ఇంతవరకూ సరఫరా కాలేదని వైద్యులు చెబుతున్నారు.

- వ్యాధినిరోధక టీకాల్లో పెంటావాలెంట్ వ్యాక్సిన్ అత్యంత కీలకమైనది. అత్యంత ప్రమాదకరమైన డిఫ్తీరియా (కోరింత దగ్గు), టెటనస్, హెపటైటిస్– బి వంటి వ్యాధులు రాకుండా రక్షణనిస్తుంది. ఒక విధంగా వ్యాధినిరోధక టీకాల్లో ఇది సర్వరోగ నివారిణిగా పనిచేస్తుంది. అలాంటి వ్యాక్సిన్ ఇప్పుడు అన్ని చోట్లా పూర్తిస్థాయిలో అందుబాటులో లేదు. ఇది బిడ్డ పుట్టిన 6 వారాల్లోగా వేయాలి. తిరిగి ఏడాదిలోపు మళ్లీ ఒకసారి వేయాలి. అత్యంత సమర్థవంతంగా పనిచేసే ఈ వ్యాక్సిన్ ఇప్పుడు అరకొరగా ఉండటం ఇబ్బందిగా ఉంది.

ఏ వ్యాక్సిన్ ఎప్పుడు వేయించుకోవాలి..

వ్యాక్సిన్	మొదటి డోసు	రెండో డోసు
మీజిల్–రూబెల్లా	9-12 నెలల మధ్య	16-24 నెలల మధ్య
ఇనాక్టివ్ పోలియో వ్యాక్సిన్	ఏడాదిన్నరకు	మూడున్నర సంవత్సరాల లోపు
రోటోవాక్ వ్యాక్సిన్	ఏడాదిన్నరకు	మూడున్నర సంవత్సరాల లోపు
డీపీటీ	16-24 నెలల మధ్య	5 ఏళ్ల లోపు
హెపటైటిస్ బి	పుట్టిన 24 గంటల్లోనే	-
పెంటా వాలెంట్	పుట్టిన 6 వారాల నుంచి	ఏడాది లోపు
విటమిన్ ఎ సిరప్	9 నెలలలోపు	16-24 నెలల మధ్య

ఉమ్మడి జిల్లాలో వ్యాక్సిన్‌కు అర్హులైన 0-5 ఏళ్లలోపు పిల్లలు: 5 లక్షల మంది

ఏడాదిలో జననాల సంఖ్య: 45 వేల నుంచి 50వేలు

సరఫరా లేటవుతోంది



వ్యాక్సిన్‌లు అన్నీ విజయవాడ నుంచే రావాలి. అక్కడి నుంచి రావడం కాస్త ఆలస్యమవుతోంది. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలకు కూడా ఒకే వాహనంలో సరఫరా చేయాల్సి ఉంది. ఇటీవల జిల్లాకు వచ్చిన వ్యాక్సిన్‌లు ఎక్కడెక్కడ లేవో అక్కడికి ప్రాధాన్యతా క్రమంలో పంపిస్తున్నాం.

–డాక్టర్ యుగంధర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, అనంతపురం

టీకాలు వేసుకోకపోతే సమస్యలు



టీకాలు క్రమం తప్పకుండా వేసుకోవాలి. టీకాలు వేసుకోవడం ద్వారా వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. ఆలస్యమైతే వ్యాధుల బారినపడే అవకాశం లేకపోలేదు. పుట్టినప్పటి నుంచి 15 ఏళ్ల వరకు టీకాలు వేసుకోవచ్చు. వివిధ దశల్లో టీకాలు వేసుకోకపోతే టీబీ, కోరింత దగ్గు, ధనుర్వాతం, టెటనస్, న్యుమోనియా, డయేరియా, పోలియో, మీజిల్స్, రూబెల్లా, తదితర అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు పిల్లలకు టీకాలు వేయించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– డాక్టర్ ప్రవీణ్‌దీన్‌కుమార్, చిన్నపిల్లల వైద్య నిపుణులు, అనంతపురం

పోలీసు సమస్యల పరిష్కారానికే 'దర్బార్'



ఎస్పీకి అర్జీ ఇస్తున్న మహిళా కానిస్టేబుల్

పుట్టపర్తి టౌన్: శాంతిభద్రతల పరిరక్షణలో అహరహం శ్రమించే పోలీసుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎస్పీ రత్న తెలిపారు. పోలీసులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి తగు చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా పోలీస్ దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అధ్యక్షతన పోలీస్ దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బంది క్యాజువల్ లీవులు, టీఏలు, అలవెన్సులు, జీపీఎఫ్ లోన్లు, మెడికల్ బిల్లులు, సీనియార్టీ లిస్ట్, బదిలీలు తదితర సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఎస్పీ రత్న మాట్లాడుతూ, తన పరిధిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తానని, తన పరిధిలో లేని సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విధి నిర్వహణలో సిబ్బందికి ఎలాంటి సమస్య ఎదురైనా నిర్భయంగా పోలీస్ దర్బార్‌లో తెలపవచ్చన్నారు. పోలీసులంతా మంచి ఆహారపు అలవాట్లు పెంపొందించుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం ఆమె పలువురికి షూ, మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, డీపీఓ సూపరింటెండెంట్ సరస్వతి, ఆర్ఐలు వలి, మహేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల ఉత్తర్వులు అందజేత

పోలీసు శాఖలో పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ రత్న భరోసానిచ్చారు. అనారోగ్యంతో మృతి చెందిన కొత్తచెరువు మండలం యర్రపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు చెన్నప్ప భార్య చంద్రకళకు కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులను మంగళవారం ఎస్పీ రత్న అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో మరణించిన మరో హోంగార్డు నాగప్ప భార్యకు కారుణ్య నియామకం కింద ఉద్యోగంతో పాటు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఓ సుజాత పాల్గొన్నారు.

నిర్మాణ రంగంలో ఉచిత శిక్షణ

లేపాక్షి: నిర్మాణ రంగంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఏడీ గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి ల్యాండ్ సర్వేయర్, 10వ తరగతి నుంచి డిగ్రీ ఉత్తీర్ణులైన వారికి ఎలక్ట్రీషియన్‌గా శిక్షణ ఇచ్చి ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న 18 నుంచి 35 లోపు వయసున్న వారు 18వ తేదీలోపు ఆధార్, రేషన్‌కార్డు, ఫొటోలను జతపరిచిన దరఖాస్తులను హిందూపురం ముక్కిడిపేటలో ఉన్న పాత ఎస్సీ బాలుర వసతి గృహంలో సమర్పించాలన్నారు. వివరాలకు 90529 01657, 91105 50779లో సంప్రదించవచ్చు.

అరుణాచలానికి ఆర్టీసీ సర్వీసులు

హిందూపురం: అరుణాచలం గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హిందూపురం డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. ఈనెల 17, 24వ తేదీల్లో ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు హిందూపురం నుంచి బయలుదేరి వెళ్తాయని డీఎం శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానుపోనూ ఒకరికి రూ.1,320 టికెట్టు ధర ఉంటుందన్నారు. ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.1,000 చార్జీ ఉంటుందన్నారు. టికెట్లు ముందస్తుగా రిజర్వేషన్ చేసుకోవాలనుకునే వారు 9440834715 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

- రామాపురంలో అరవై ఏళ్లుగా ఉన్న రస్తాకు అడ్డంకి
- రోడ్డుకు అడ్డంగా కంచె నాటిన వైనం
- ఆందోళన చెందుతున్న రైతులు



రామాపురంలో రస్తాకు అడ్డంగా నాటిన ఇనుప కంచె

సాక్షి, పుట్టపర్తి: తాడిమర్రి మండలం రామాపురం గ్రామంలో టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. 60 ఏళ్లుగా ఉన్న పొలాల వద్దకు వెళ్లే రస్తా (బండిబాట)కు అడ్డంగా ఇనుప కంచె నాటారు. అవతలి వైపు పొలం ఉన్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు... గ్రామంలోని ఎత్తిపోతల పథకం కాల్వ పక్కన ఉన్న పొలాలకు 60 ఏళ్లుగా సర్వే నంబర్ 116లో రస్తా (బండిబాట) ఉంది. అలాగే గ్రామంలోని ఎత్తిపోతల పథకం (ఐడీసీ) ద్వారా నీటి కాల్వలు మళ్లించడానికి, నీటి తొట్టి వద్దకు అదే రస్తా గుండా రైతులు వెళతారు. ఈదారిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల పొలాలే అధికంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గుది చిన్న వెంకటరాముడు, గుది కోనేటి నాయుడు రస్తాకు కంచె వేసే ప్రయత్నం చేశారు. దీంతో వైఎస్సార్ సీపీ నాయకులు చిన్న కప్పల చంద్రశేఖర, కప్పల కుళ్లాయప్ప, ఉలికంటి రాజు తదితరులు అడ్డుకున్నారు. దీంతో వివాదం చెలరేగగా... సోమవారం మండల, సచివాలయ సర్వేయర్లు గ్రామానికి వెళ్లి రస్తా కొలతలు వేసి వెళ్లారు. కానీ మంగళవారం మధ్యాహ్నం ఒక సుమో, రెండు ద్విచక్ర వాహనాల్లో 13 మంది దాకా కొత్త మనుషులు (ఇతర ప్రాంతాలవారు) వచ్చి రైతులను భయభ్రాంతులకు గురిచేశారు. దౌర్జన్యంగా రస్తాకు అడ్డంగా నాలుగు స్తంభాలు నాటి ఇనుప కంచె ఏర్పాటు చేశారు. దీనిపై వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం అక్రమ రవాణాను అరికట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య

పుట్టపర్తి టౌన్: ఇతర రాష్ట్రాల నుంచి మద్యం అక్రమంగా జిల్లాలోకి సరఫరా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, సరిహద్దు చెక్‌పోస్టులను మరింత బలోపేతం చేయాలని ఎక్సైజ్ అధికారులను ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ఆదేశించారు. మద్యం అక్రమ రవాణా, నాటుసారా, బెల్ట్ షాపుల నిర్వహణపై మంగళవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. స్టేషన్ల వారీగా అక్టోబర్ నుంచి ఇప్పటి వరకూ నమోదైన కేసుల వివరాలు ఆరా తీశారు. జిల్లా వ్యాప్తంగా నాటుసారాకు సంబంధించి నమోదైన 39 కేసుల్లో 14 మందిని అరెస్ట్ చేసి 941 సారా ప్యాకెట్లు, 6,530 బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లుగా తెలుసుకుని అసంతృప్తి వ్యక్తం చేశారు. నాటు సారా తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణా కాకుండా బార్డర్ చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు మద్యం విక్రయాలు సాగిస్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. కల్తీ కల్లు, గంజాయి తదితర విక్రయాలు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ మునిస్వామి, జిల్లా అధికారి గోవిందనాయక్, ఉమ్మడి జిల్లా ఏఈఎస్‌లు శ్రీరామ్, నరసింహులుతో పాటు 8 స్టేషన్ల సీఐలు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సమాజ వికాసానికి పాటుపడాలి





పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు, అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్, సమావేశంలో పాల్గొన్న అధికారులు

- సీఎస్ఆర్ ఫండ్స్‌తో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలి
- పరిశ్రమల యాజమాన్యాలతో కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: పరిశ్రమల యాజమాన్యాలు కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద వివిధ అభివృద్ధి పనులు చేపట్టి సమాజ వికాసానికి పాటుపడాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాలులో జిల్లాలోని వివిధ పరిశ్రమల యజమాన్య ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలో సీఎస్ఆర్ నిధులు వినియోగం, ఇప్పటి వరకు సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన పనుల వివరాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ప్రణాళికా బద్ధంగా సీఎస్ఆర్ నిధులు వినియోగించాలన్నారు. సీఎస్ఆర్ నిధులు వినియోగానికి సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనులతో పాటు ప్రజల ఉపయోగపడేలా వినూత్న కార్యక్రమాలను చేపట్టాలన్నారు. జిల్లాలో సీఎస్ఆర్ నిధులు వినియోగానికి తప్పని సరిగా కలెక్టర్‌తో ముందస్తు అనుమతి తప్పనిసరి అని తెల్పి చెప్పారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా చేపట్టే కార్యక్రమాలకు తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఉండాలన్నారు. సీఎస్ఆర్ పనుల కన్వీనర్‌గా జిల్లా ప్రణాళికా అధికారి వ్యవహరిస్తారని, కంపెనీల ప్రతినిధులకు ఎలాంటి సందేహాలున్నా సీపీఓ ద్వారా నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో సీపీఓ విజయకుమార్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, డీపీఓ సమిత, డీఈఓ కిష్టప్ప, జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ల అవిష్కరణ

ప్రశాంతి నిలయం: ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించనున్న గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను కలెక్టర్ టీఎస్ చేతన్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, డీఈఓ కిష్టప్ప మంగళవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ చేతన్ మాట్లాడారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయాల ఉద్యమకారులను స్మరణ కార్యక్రమాలు, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్రీడా పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20న డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు జయరాం, రామాంజినమ్మ, జయసింహరాజు, ఖాజామొద్దీన్, వెంకటరమణప్ప, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జపాన్ బృందంతో జేఎన్‌టీయూ వీసీ భేటీ



జపాన్ బృందంతో ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు మంగళవారం విజయవాడలో జపాన్ బృందంతో భేటీ అయ్యారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్ (ఐసీసీఆర్)కు సంబంధించి జేఎన్‌టీయూ అనంతపురంలో ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేశామని ఇన్‌చార్జ్ వీసీ తెలిపారు. విదేశీ విద్యార్థుల సౌలభ్యం కోసం అంతర్జాతీయ ఒప్పందాలను సులభతరం చేయడానికి వీలుగా యూనివర్సిటీలో ప్రత్యేక విభాగం ఉందన్నారు. స్ట్రక్చరల్ ఇంజినీరింగ్, మెకాట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ వీఎల్ఎస్ఐ, సెమీ కండక్టర్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదితర కోర్సుల్లో ఇతర దేశాల యూనివర్సిటీలతో విద్యార్థుల పరస్పర అడ్మిషన్లు చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నామని జపాన్ ప్రతినిధులతో పేర్కొన్నట్లు తెలిపారు. జపాన్ బృందంలో టొయామా డిస్ట్రిక్ట్ తరపున పరిశ్రమల వ్యవహారాల డైరెక్టర్ హోంగోయూ మిస్, ట్యోయా తరపున ఆంధ్రప్రదేశ్ వ్యవహారాలు చూసే ఐటోబో, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రియల్ ట్రేడ్ మురాటా, అకిరో యోకాటా పాల్గొన్నారు.